Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
స్పాట్ ఎడిషన్
epaper.telanganaveena.com హైదరాబాద్ సోమవారం 21.10.2024

## ఏపీ హైకోర్టును ఆశ్రయించిన అల్లు అర్జున్



తెలంగాణవీణ, సినిమా : టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఏపీ ఎన్నికల సందర్భంగా వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర తరఫున నంద్యాలలో ఈ ఏడాది మే 11వ తేదీన బన్నీ ప్రచారంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి అభిమానులు, జనాలు పోటెత్తారు. అయితే, ఈ కార్యక్రమానికి శిల్పారవి గానీ, అల్లు అర్జున్ తరఫున గానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో స్థానిక వీఆర్ఓ అనుమతి లేకుండా భారీ జన సమీకరణ జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో శిల్పారవితో పాటు బన్నీపై సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 ఉల్లంఘన కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై తాజాగా అల్లు అర్జున్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఎన్నికల సమయంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను న్యాయస్థానం స్వీకరించింది. మంగళవారం విచారించే అవకాశం ఉందని సమాచారం.

## వీరమరణం పొందిన పోలీసుల కుటుంబాలకు రూ.1కోటి నష్టపరిహారం

## తెలంగాణ పోలీసులపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు



తెలంగాణవీణ, హైదరాబాద్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర పోలీసులపై వరాల జల్లు కురిపించారు. వీరమరణం పొందిన పోలీసుల కుటుంబాలకు రూ.1కోటి నష్టపరిహారంగా ఇస్తామని ప్రకటించారు. గోషామహల్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన తర్వాత రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా అమరవీరుల ఫ్యామిలీలకు ఇచ్చే నష్టపరిహారంపై కీలక ప్రకటన చేశారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వీరమరణం పొందితే కోటి రూపాయలు.. అదే ఎస్ఐ, సీఐ స్థాయి అధికారికి రూ. 1.25 కోట్లు ఇస్తామన్నారు. ఇక డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీలు వీరమరణం పొందితే రూ. 1.50కోట్లు, ఐపీఎస్‌లకు రూ.2కోట్లు పరిహారంగా ఇస్తామని తెలిపారు. అంతేగాక వారి కుటుంబంలో అర్హతను బట్టి గవర్నమెంట్ జాబ్ కూడా ఇస్తామన్నారు. అలాగే శాశ్వత అంగవైకల్యం పొందిన అధికారుల ర్యాంకు ఆధారంగా రూ.50లక్షల వరకు నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు.


## పవన్ కు కోర్టు సమన్లు



తెలంగాణవీణ, హైదరాబాద్ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు హైదరాబాద్ లోని సిటీ సివిల్ కోర్టు సమన్లు జారీ చేసింది. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో ఈ సమన్లు జారీ చేసింది. లడ్డూ నాణ్యతపై పవన్ చేసిన వ్యాఖ్యలతో హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ రామారావు అనే న్యాయవాది పిటిషన్ వేశారు. ఆధారాలు లేకుండా లడ్డూ నాణ్యతపై వ్యాఖ్యలు చేశారని తన పిటిషన్ లో రామారావు పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా గ్యాగ్ ఆరర్ ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్ ను విచారించిన కోర్టు పవన్ కు సమన్లు జారీ చేసింది. నవంబర్ 22న కోర్టు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లలో పేర్కొంది.

## గ్రూప్ 1 పరీక్ష వాయిదాకు సుప్రీం కోర్టు నిరాకరణ - జోక్యం చేసుకోలేమని స్పష్టం








తెలంగాణవీణ, హైదరాబాద్ : గ్రూప్ 1 వాయిదా వేయాలని కోరుతూ గ్రూప్ 1 అభ్యర్థులు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. పరీక్షల నిర్వాహణలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణలో గ్రూప్ 1 పరీక్ష నిర్వహణకు లైన్ క్లియర్ అయింది. ఓ వైపు పరీక్షకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ సుప్రీం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో అన్న భయం సీరియస్‌గా ప్రిపేర్ అయిన అభ్యర్థులు, అధికారుల్లో ఉంది. ఈ టైంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రూప్ 1 పరీక్షల్లో అమలు చేస్తున్న జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని చెప్పి కొందరు అభ్యర్థులు చాలా రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నారు. అన్ని మార్గాల్లో ప్రభుత్వంపై, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. కోర్టుల్లో పోరాడారు. అయినా తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇప్పటికే పలు మార్లు గ్రూప్ 1 పరీక్షలో గందరగోళం నెలకొనడంతో ఈసారి పరీక్ష జరిపే తీరాలని భావించింది. ఆ దిశగానే ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. రిజర్వేషన్ల విషయంలో పట్టువీడాలని కోరుతూ ఫైట్ చేసిన అభ్యర్థులు ముందుగా హైకోర్టులో సింగిల్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. అక్కడ వాళ్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. తర్వాత తెలంగాణ హైకోర్టులోని డివిజన్ బెంచ్‌కు వెళ్లినా అనుకూలంగా తీర్పు రాలేదు. ఇప్పుడు సుప్రీంకోర్టులో కూడా చుక్క ఎదురైంది. కోర్టుల్లో పోరాడుతూనే రాజకీయంగా కూడా వారు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. ఇవాళ్టి నుంచి జరిగే గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు ఆపేందుకు శతవిధాలుగా యత్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిశారు. ఈ పోరాటానికి ఆయన మద్దతు ఇచ్చారు. ప్రభుత్వం పట్టు వీడి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది బీఆర్ఎస్ పార్టీ.

## మోడీ డిగ్రీ సర్టిఫికెట్ల కేసులో కేజ్రీవాల్ కు చుక్కెదురు



తెలంగాణవీణ, జాతీయం : ప్రధాని మోడీ డిగ్రీ సర్టిఫికెట్ల కేసులో మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మోడీ డిగ్రీపై కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి గుజరాత్ యూనివర్సిటీ పరువు నష్టం దావా వేసింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం విచారించిన న్యాయస్థానం పిటిషన్ కొట్టేసింది. దీంతో ఆయనపై పరువు నష్టం కేసు విచారణ కొనసాగనుంది. గుజరాత్ యూనివర్సిటీ వేసిన పరువు నష్టం కేసులో భాగంగా గుజరాత్ పోలీసులు కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేశారు. దీనిపై కేజ్రీవాల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఇక్కడ కూడా కేజ్రీవాల్‌కు భంగపాటు ఎదురైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం సోమవారం కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణ జరిపింది. వాదోపవాదాల అనంతరం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. గతంలో ఇలాగే ఆప్ నేత సంజయ్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏప్రిల్ 2024లో కొట్టివేసినట్లు ధర్మాసనం గుర్తుచేసింది.

## చైతూ శోభిత పెళ్లి పనులు షురూ





తెలంగాణవీణ, సినిమా : అక్కినేని వారి ఇంట పెళ్లి సందడి మొదలైంది. నాగ చైతన్యకి ఇటీవలే హీరోయిన్ శోభితా ధూళిపాళతో వివాహ నిశ్చితార్థం అయింది. అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు తెలుగు సినిమా ఇండస్ట్రీకి చెందిన వారు చాలా మంది ఎప్పుడు వీరి పెళ్లి జరగబోతుంది అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పెళ్లి తేది విషయంలో గత కొన్ని రోజులుగా ఉన్న సస్పెన్స్‌కి తెర దించుతూ పెళ్లి ఏర్పాట్లు మొదలు అయ్యాయి. శోబితా ధూళిపాళ ఇంట పెళ్లి ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. వైభవంగా శోభితా ఇంట వేడుక జరిగింది. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## భారత క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్...



తెలంగాణవీణ, క్రీడలు : గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో గాయపడిన టీమిండియా పేసర్ మహ్మద్ షమీ ఎట్టకేలకు పూర్తిగా కోలుకున్నాడు. ఈ మేరకు షమీ సోమవారం ఒక సందేశాన్ని అభిమానులతో పంచుకున్నాడు. ఇప్పుడు తాను వందకు వందశాతం ఎలాంటి నొప్పి లేకుండా ఫిట్‌గా ఉన్నట్లు పేర్కొన్నాడు. బెంగళూరులో న్యూజిలాండ్‌తో తొలి టెస్టు ముగిసిన తర్వాత షమీ నెట్స్‌లో చెమటోడ్చాడు. ఈ సందర్భంగా పూర్తి సెషన్ బౌలింగ్ వేయడం తనకు సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు. ఇక గతేడాది చీలమండ గాయం కారణంగా సర్జరీ చేయించుకున్న షమీ అప్పటి నుంచి పూర్తిగా క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే ప్రాక్టీసు మొదలుపెట్టాడు.అయితే, మళ్లీ అతని మోకాళ్లలో వాపు వచ్చిందని, ఇది షమీ జట్టులో పునరాగమనంపై ప్రభావం చూపించే అవకాశం ఉందంటూ కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవల వెల్లడించాడు. హిట్‌మ్యాన్ అలా చెప్పిన రోజుల వ్యవధిలోనే తాజాగా షమీ తాను పూర్తిగా కోలుకున్నట్లు చెప్పుకొచ్చాడు.